## ప్రశ్న 305: స్వామి అనుగ్రహం

## ఓం శ్రీ సాయి రామ్

## ఈ ప్రశ్న-సమాధానములు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 26-29 నుండి తీసికొనబడినవి

**స్వామి, భగవంతుని అనుగ్రహం మాపై ఎందుకు లేదు?**
**భగవాన్:** అలాగ అనుకోవడము సరి కాదు. తప్పు. దైవానుగ్రహం అందరికీ దొరుకుతుంది. భగవంతునికి కుల, జాతి, మత, లింగ భేదాలు ఉండవు.

ఏమైనా లోపం ఉంటే అది నీలో ఉండవచ్చు. చిత్తశుద్ధి చేయుటకు ప్రయత్నించాలి. ఉదాహరణకి, ఇప్పుడు వర్షం ఎక్కువగా కురుస్తూ ఉంది. ఒక గిన్నెలో ఆ నీరు సేకరించాలంటే ఆ గిన్నెను పైకి పట్టాలి. గిన్నెను బోర్లించినా, లేక పక్కకు పెట్టినా నీరు పట్టగలవా? ఎంత వాన పడినా పట్టలేవు.

కనుక మన హృదయమును కల్మషం లేకుండా, పరిశుద్ధంగా పెట్టుకుంటే, మనకు దైవానుగ్రహమనే వర్షం నీరు దొరుకుతుంది. మన హృదయమును భగవంతుని ప్రేమ వైపుకి తిప్పితే దైవానుగ్రహం దొరుకుతుంది, కదా?

**స్వామి, మా అదృష్టం అపరిమితమైనది! ఎంత మందికి లభిస్తుంది ఇలాంటి అవకాశం? ఇదంతా మీ దయ. దీనిని ఇలాగే నిలుపుకోవడం ఎలాగ?**

**భగవాన్:** చూడండి, కోట్లాది భక్తులలో ఎంత మంది ఇక్కడ ఉండగలుగుతున్నారు? అందరికీ సాధ్యమౌతుందా? మీ పూర్వ జన్మ పుణ్యం వల్ల మీరిక్కడ ఉండగలిగే అదృష్టం మీకు దొరికింది. మన సంస్థల్లో ఉండే వేలాది మంది విద్యార్థులలో కొంత మందికే కోడైకనాల్ కి నాతో రావడానికి వీలైంది. ఇది మీరు జాగ్రత్తగా కాపాడుకోవాలి.

ఒక చిన్న ఉదాహరణ: ఇది ఒక దారపు చుట్ట. దీని చుట్టూ దారం ఎన్నో సార్లు చుట్టబడింది. ఇది చుట్టడానికి ఎంతో కాలం పట్టి ఉంటుంది. కానీ ఎవరైనా దీనిని తొందరలో క్రింద పడవేస్తే దారమంతా ఊడిపోయి క్రింద పడిపోతుంది. అలాగే, మీ అదృష్టం ఈ దారపుటుండ లాగా ఎన్నో జన్మముల పుణ్యంతో కూడినది.

ఈ భాగ్యమును అజాగ్రత్తతో అశ్రద్ధ చేస్తే మళ్ళీ తిరిగి రాదు. మీరు చేసిన శ్రమ అంతా వృధా అయిపోతుంది. ఈ దారపుటుండ మధ్యలో ఉండే రీలు మీ నమ్మకం వంటిది. మీ పుణ్య కార్యములన్నీ దీని చుట్టూ చుట్టబడినవి. కనుక మీ అదృష్ట భాగ్యమును అశ్రద్ధ చేయకండి. అది సాధారణమైనది, సామాన్యమైనది అని భావించకండి. ఆధ్యాత్మిక మార్గమున ఉన్న వారికి అలక్ష్యం, నిర్లక్ష్యం చాలా హానికరం.

**స్వామి, మీ అనుగ్రహం వల్ల మా సంచిత కర్మ, ప్రారబ్ధ కర్మ, ఆగామి కర్మలు ఎలా ప్రభావం చెందుతాయి?**

**భగవాన్:** దైవానుగ్రహం, దైవ సంకల్పం దేన్నైనా మార్చివేయ కలుగుతుంది. భగవంతుడనగా ప్రేమ. భగవంతుని అపారమైన కరుణతో నీ ప్రారబ్ధ కర్మ కానీ నీ పూర్వ జన్మముల కర్మ ఫలములు కానీ మార్చివేయగలడు. భక్తుడు తన హృదయమనే జైలులో దేవుని బంధించి వేయగలడు.

ఈ లోకంలో భక్తితో సాధించలేనిది ఏదియు లేదు. దైవానుగ్రహంతో నీ పూర్వ జన్మ కర్మ ఫలములు, కర్మ ప్రభావములు చెరిపి వేయవచ్చు. ప్రతికూలమైన దురదృష్టములు ఏవి జరగవు.

ఒక చిన్న ఉదాహరణ: మందుల షాపులో అనేక రకమైన మందులు అమ్మకానికి పెట్టి ఉంటాయి. ప్రతి మందు సీసా పైన ఆ మందు తయారు చేసిన తేది, ఎక్స్‌పైరీ తేదీ వ్రాసి ఉంటాయి. ఎక్స్‌పైరీ తేదీ తర్వాత వాడితే ఆ మందు పని చేసే శక్తి తగ్గిపోతుంది. పనికి రాకుండా పోతుంది.

భగవంతుడు కూడా అదే చేస్తాడు. మందు సీసా మీద ఎక్స్‌పైరీ తేదీ ముద్ర కొట్టినట్లు నీ ప్రారబ్ధ కర్మ రద్దు అయిపోయేటట్లు చేస్తాడు. అంతటితో నీ బాధ, కష్టములు అంతమైపోతాయి. ఈ విధముగా స్వామి, తన అపారమైన దయ, కరుణతో నీ బాధలు తీరుస్తాడు.

**స్వామి, ప్రతి రోజూ సాధన చేస్తే భగవంతుని అనుగ్రహం తప్పక దొరుకుతుందా?**
**భగవాన్:** తప్పకుండా! తప్పకుండా దొరుకుతుంది! సందేహం ఎందుకు? ఉదాహరణకి, నీకొక పెంపుడు కుక్క ఉందనుకో. దానికి రోజూ తిండి పెడితే, రోజూ అదే సమయానికి నీ దగ్గరకు వస్తుంది. ఆ విధంగా క్రమము తప్పకుండా చేసినదానికి నీ కుక్కే క్రమమును అనుసరిస్తే మరి భగవంతుడు ఎందుకు చెయ్యడు? తప్పకుండా అనుగ్రహం దొరుకుతుంది.

**స్వామి, మీ అపారమైన కరుణ, అనుగ్రహం వల్ల మేము ఈరోజు ఇక్కడ ఉన్నాము. మీ దర్శన, స్పర్శన, సంభాషణ అనే సూర్యకిరణాలలో ఆనందిస్తున్నాము. అయినా కూడా పూర్వ జన్మ సుకృతము అవసరమా?**

**భగవాన్:** ఈ నాటి ఆనందము, పూర్వ జన్మ సుకృతము, రెండూ అవసరమే. రెండిటికీ సంబంధ బాంధవ్యములు ఉంటుంటాయి. ఉదాహరణకి, ఇక్కడ మట్టి ఇసుక మట్టి. వర్షము ఎక్కువగా పడినప్పుడు నీరంతా ఇసుకలోకి ఇంకిపోతాయి. మీలో కూడా ఆ విధముగనే భక్తి స్థిరంగా ఉండదు.

కానీ నదిలో వర్షం పడితే నీరు ఎలా ప్రవహిస్తుంది? అంతకు ముందు కంటే ఉధృతంగా ప్రవహిస్తుంది. అదే విధముగా మీరు ఈ ప్రస్తుత్త సమయములో ఇక్కడ నాతో ఉండగలగడము ఆ వర్షము నీరు వంటిది. అందువలననే ఈ అదృష్టము, భాగ్యమును జాగ్రత్తగా కాపాడుకోమని మీతో ఎప్పుడూ చెపుతూ ఉంటాను. ఒక బావిలోనుంచి నీరు తోడాలంటే ఒక బకెట్టుతో లాగి, ఆ నిండు బకెట్టును నువ్వే మొయ్యాలి.

కానీ ఆ బకెట్టును మధ్యలో పడేస్తే ఏమౌతుంది? ఆ నీరుని మళ్ళీ అందులో పోయ్యలేవు కదా? కానీ భగవంతుని తీవ్రంగా ప్రార్థిస్తే ఏదైనా సాధ్యమౌతుంది. మానవుని ప్రయత్నం పెరిగితే భగవంతుని అనుగ్రహం కూడా అదే రీతిగా ఉంటుంది. అప్పుడే మానవుడు దేన్నైనా సాధించగలడు.